క్లుప్తంగా

మడెలేశ్వర స్వామి మండపం నిర్మాణానికి నిధులు తెస్తా



రఘువీర్‌సింగ్‌ను సన్మానిస్తున్న రజకులు

జూలపల్లి: మండలకేంద్రంలోని మడెలేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ తెలిపారు. సోమవారం మడలేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మండపం నిర్మా ణానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంగిపెల్లి భూమయ్య, సాగర్, వెంకటేశ్, నగునూరి నర్సింగం, ఓదెలు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నర్సయ్య, శంకరయ్య, ఎల్లయ్య, ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పరిష్కారం



మాట్లాడుతున్న మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్‌తోనే ప్రజల సమస్యలు తీరుతాయని రామగుండం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. హథ్ సే హథ్ జోడోయాత్రలో భాగంగా సోమవారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్‌లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ జోడోయాత్ర కొనసాగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారెల్లి రాజిరెడ్డి, దేవనపల్లి చక్రపాణి, రాజేశ్, కిషన్‌నాయక్, తిరుపతి, రాజు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన



డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మి

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి వెంట వరద నీరు వెళ్లేందుకు బుధవారం ఏర్పాటుచేసిన డ్రెయినేజీ పనులను సర్పంచ్ ఆకుల ఓదెలు ఆధ్వర్యంలో ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌కుమార్ పరిశీలించారు. వర్షకాలంలో వరదనీరు ఇళ్లలోకి రాకుండా ముందస్తుగా డ్రెయినేజీని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఎంపీవో శేషయ్య సూరి, కార్యదర్శి నరేశ్ ఉన్నారు.

ఉపాధిహామీ కూలి, పనిదినాలు పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న రాజేందర్

కాల్వశ్రీరాంపూర్: ఉపాధిహామీ కూలిరెట్లు, పనిదినాలు పెంచాలని వ్యవసాయ కార్మికశాఖ జిల్లా నాయకులు మంద రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఇదులాపూర్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీపనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మండే ఎండల్లో పొట్టకూటి కోసం వాగులు, వంకలు, పొలాలు, గట్లు దాటుతూ పనిచేస్తున్న కూలీలకు రోజువారిగా రూ.600 చెల్లించాలని, 200 పనిదినాలు పెంచాలని కోరారు. పనిచేసే స్థలాల్లో ప్రథమచికిత్స కిట్టు టెంట్లు, తాగునీటి సౌకర్యం కలిపించాలన్నారు. నాయకులు బూడిద గణేశ్, గట్టుస్వామి, వెంకటేశ్, సునీల్, విజయ్, కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి

పెద్దపల్లిరూరల్: ఎంతోమంది అమరవీరుల ప్రాణత్యాగాలు మరవలేనివని, కానీనేడు ఉద్యమద్రోహులకు దక్కిన గౌరవం అమరవీ రులకు, ఉద్యమ కారులకు లభించడం లేదని, మరో పోరాటానికి ఉద్యమకారులు సిద్ధం కా వాలని ప్రజాహితం నేతలు సత్యనారాయణ రెడ్డి, రామ్మూర్తి, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు అన్నారు. సోమవారం రాత్రి పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని జెండాచౌరస్తాలో తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాకారులతో ధూంధాం నిర్వహించి, ఉద్యమ కారులను సన్మానించారు.

తహసీల్దార్‌ను బదిలీ చేయండి

- సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు
- ఈనెల 16కు మండల సభ వాయిదా



తహసీల్దార్‌ను బదిలీ చేయాలంటూ డిమాండ్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకుర్తి: ప్రజాప్రతినిధులంటే గౌరవం లేదు. మాట్లాడే పద్ధతి తెలియదు. సమస్యలపై ప్రశ్నిస్తే నేను మేజిస్ట్రేట్‌ను కేసుపెట్టి జైలుకు పంపుతానంటూ బెదిరింపులకు పాల్పడుతున్న తహసీల్దార్‌ను బదిలీ చేయాలంటూ పాలకుర్తి మండలపరిధిలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు డిమాండ్‌చేశారు. సోమవారం పాలకుర్తి మండలకేంద్రంలో నిర్వహించిన మండల సభకు తహసీల్దార్ సునీత హాజరుకాకపోవడాన్ని నిరసిస్తూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించారు. ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. మండల కేంద్రం ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని నూతన భవన నిర్మాణాలకు ఇప్పటికి స్థలసేకరణ చేపట్టలేదని జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్య సభలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్య మండలంలో కార్యాలయాల నిర్మాణానికి ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. తహసీల్దార్ సునీత కార్యాలయాల నిర్మాణానికి స్థలాలను ఎంపికచేయడంలో నిర్లక్ష్యంచూపుతున్నారని మండల సభకు కూడా హాజరు కావడం లేదని మండిపడ్డారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళితే ప్రజాప్రతినిధులకు కనీసమర్యాద,గౌరవం ఇవ్వడం లేదని, విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని సర్పంచ్ సమ్మయ్య ఆరోపించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మల్లెత్తుల శ్రీనివాస్ సమ్మయ్యకు మద్దతుగా నిలిచి తహసీల్దార్ సునీత సర్వసభ్య సమావేశానికి హాజరైతే తాము సమావేశంలో పాల్గొంటామని లేకుంటే బహిష్కరిస్తామని బయటకు వెళ్లారు. దీంతో జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీడీవో లలిత, ఎంపీపీ అనసూర్య తహసీల్దార్ సునీతతో ఫోన్‌లో మాట్లాడి సమావేశానికి రావాల్సిందిగా కోరారు. దీంతో తహసీల్దార్ సునీత జూనియర్ అసిస్టెంట్‌ను సమావేశానికి పంపించడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తంచేశారు. మండల సభకు హాజరుకాని తహసీల్దార్ మండలానికి అవసరమా అంటూ ఎంపీపీ, జెడ్పీటీసీలను ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఫోన్‌లో ఎమ్మెల్యే చందర్‌తో పాటు మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు తెలిపారు. తహసీల్దార్‌కు వీలున్న రోజే మండల సభ నిర్వహించాలని ఎద్దేవాచేస్తూ సమావేశాన్నిబహిష్కరించారు. దీంతో సమావేశాన్ని ఈనెల 16కు వాయిదా వేస్తూ ఎంపీడీవో లలిత తీర్మానించారు. సభ్యుల ఆమోదంతో సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో లలిత తెలపడంతో సభ అర్ధాంతరంగా ముగిసింది. అంతకుముందు బామ్లానాయక్ తండా సర్పంచ్ బదావత్ రాజునాయక్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ దరఖాస్తులు ఇచ్చేందుకు కార్యాలయానికి వస్తే తీసుకోవడం లేదని, కార్యాలయం సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీడీవో లలిత, ఎంపివో షబ్బీర్‌పాషా, సర్పంచ్‌లు సూర సమ్మయ్య, గంధం లక్ష్మీనారాయణ, మల్లెత్తుల శ్రీనివాస్, దుర్గం జగన్, ఎంపీటీసీలు ప్రియాంక, పాత భాగ్యలక్ష్మి, దుర్గం కుమార్ మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సమస్య పరిష్కరించాలి

- బిల్డింగ్ ఎక్కి నిరసన తెలిపిన సర్పంచ్‌లు
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- ఎంపీపీ రాసకొండ లక్ష్మి



బిల్డింగ్ ఎక్కి నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

కమాన్‌పూర్: రాష్ట్రప్రభుత్వం ఇంటింటికి తాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం గ్రామాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని పనులు చేపట్టకపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని మిషన్ భగీరథ సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తూ సర్పంచ్‌లు బొల్లపెల్లి శంకర్‌గౌడ్, ఆకుల ఓదెలు, కట్కం రవీందర్, కొండ వెంకటేశ్ ఎంపీడీవో కార్యాలయం పైకిఎక్కి నిరసన తెలిపారు. ఎంపీడీవో విజయ్‌కుమార్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్‌లకు హామీ ఇవ్వడంతో సమావేశానికి వచ్చారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాసకొండలక్ష్మి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.గ్రామాల్లో నిర్మించిన మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులకు పైపులైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయని సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని లేనియెడల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే తాగునీటి దినోత్సవాన్ని బహిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మండలకేంద్రంలోని శ్మశానవాటికలో బోరు మోటారు పనిచేయకపోవడంతో స్నానాలు చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్ అన్నారు. ఎస్సారెస్పీ కాలువలపై గతంలో నిర్మించిన కల్వర్టులు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందని వాటి స్థానంలో కొత్త కల్వర్టులు నిర్మించాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమాన్‌పూర్ ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు దాసరి రామలింగు,ఇనగంటి భాస్కర్‌రావు, వైస్‌ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్, ఎంపీటీసీలు గొడిసెల ఉమ, కోఆప్షన్ సభ్యులు ఇంతీయాజ్, డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న దాసరి ఉష

సుల్తానాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని 2,3 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి బీఎస్పీని పరిచయం చేస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, మాన్యవర్ కాన్షీరామ్ నోటు దో– ఓటు దోఅనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని రానున్న ఎన్నికల్లో బహుజన రాజ్యంలో పెద్దపల్లి నియోజకవర్గం ఉండాలన్నారు. ఏ పార్టీ మహిళలను ప్రోత్సహించడం లేదని, కేవలం బీఎస్పీ ప్రోత్సహిస్తోందని ప్రజలంతాబీఎస్పీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ.రియాజ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ అముదాల అరుణ, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు బోయిని రంజిత్, మండల కార్యదర్శి క్యాదాసి రమేశ్, మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు తోట మధు, కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, బీవీఎఫ్ జిల్లా కన్వీనర్ మచ్చరాహుల్ తదితరులు పాల్గొన్నారు.

‘తొమ్మిదేళ్లుగా రాచరిక పాలన’



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ‘నక్సలైట్ల ఎజెండాయే..నా ఎజెండా’.. అన్న కేసీఆర్ తొమ్మిదేళ్లుగా రాచరికపు పాలన సాగిస్తున్నారని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో గోరంత సాధించి కొండంత సాధించినట్లుగా భ్రమింపజేసేందుకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించిన వారిని అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం లేదని, ప్రభుత్వ పథకాలు అందక అవస్థలు పడుతున్నారన్నారు. అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, ధరణి వెబ్‌సైట్ లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు సత్యనారాయణరెడ్డి, రమేశ్, వెంకన్న, శంకర్, లక్ష్మి, రాములు, చంద్రయ్య, తేజేశ్వర్, పాపయ్య, రాజేందర్, సారయ్య, పోచం, సురేశ్, శ్రీనివాస్, కల్పన పాల్గొన్నారు.

బూత్‌కమిటీలతో బీఆర్‌ఎస్ బలోపేతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల: గ్రామాల్లో బూత్‌కమిటీలతో బీఆర్‌ఎస్ బలోపేతం అవుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఓదెలలో బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 22 గ్రామాల్లో పార్టీబలోపేతానికి బూత్‌కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను రచ్చబండల వద్ద గ్రామకూడళ్ల వద్ద ప్రజలకు ఓటర్లకు వివరించాలన్నారు. పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, ఓదెల ఎంపీపీ రేణుకదేవి, ఓదెల సర్పంచు మహేందర్, నాయకులు డాక్టర్ సతీశ్ గ్రామాల్లో తిరిగి కమిటీలు వేయాలన్నారు.

కాంగ్రెస్ విమర్శలు తిప్పికొట్టాలి

సుల్తానాబాద్: కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతీ బీఆర్‌ఎస్ కార్యకర్తపై ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పట్టణాభివృద్ధి చేయడం లేదనడం విడ్డూరంగా ఉందన్నారు. రహదారుల వెంట ముఖ్య కూడళ్లలో సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్ల నిర్మాణం, రాష్ట్ర ప్రభుత్వ చొరవతోనే పూర్తిచేశామన్నారు. సుల్తానాబాద్ నుంచి పూసాల చెరువువరకు రూ.2కోట్లతో డబుల్‌రోడ్డు, సెంట్రల్‌లైటింగ్ టెండర్ పూర్తిచేశామన్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి నీరుకుల్ల రోడ్డు వరకు రూ.90 లక్షలతో రోడ్డు పనులకు టెండర్ పూర్తయిందన్నారు. సుల్తానాబాద్ నుంచి నీరుకుల్ల వరకు రోడ్డు పనులు వేగవంతం చేస్తున్నామన్నారు.

పల్లెలను పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దాలి

- 15న పల్లెప్రగతి పనులపై శ్రద్ధ చూపండి
- పంచాయతీ స్టేట్ కోఆర్డినేటర్ విజయరావు



అధికారులతో మాట్లాడుతున్న విజయరావు

పెద్దపల్లిరూరల్: పల్లెలను పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దాలని దశాబ్ది ఉత్సవాల నిర్వహణకమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ విజయరావు అన్నారు. ఈ సందర్భంగా పెద్దకల్వల గ్రామాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళితో కలిసి గ్రామంలో రోడ్లను పరిశీలించారు. హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఉండడాన్ని చూసి ఎంపీవో సుదర్శన్, సర్పంచ్ రమేశ్, కార్యదర్శి రణధీర్‌ను అభినందించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పల్లెల్లో ప్రగతిపథంలో ముందుకుసాగాలన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు దుస్తులు, సబ్బులు, నూనెలు సకాలంలో అందిస్తున్నారా..లేదా అని ఆరా తీశారు. గ్రామంలో చేపట్టిన పనులు పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు.

కుటుంబ కథాచిత్రాలకే ఆదరణ



షార్ట్‌ఫిలిం నటులతో బలగం కొమురయ్య

పెద్దపల్లిరూరల్: సమాజంలో కుటుంబ కథాచిత్రాలకే ఆదరణ లభిస్తోందని బలగం ఫేం కొమురయ్య అన్నారు. కేసిరెడ్డి కనకారెడి దర్శకత్వంలో నిర్మిస్తున్న‘ఇదేం..బలగం’ లఘుచిత్రాన్ని కరీంనగర్, ఆరెపల్లి ప్రాంతాల్లో చిత్రీకరించగా అందులో పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన మర్కు లక్ష్మణ్ నటించారు. ఈ సందర్భంగా బలగం కొమురయ్యను కలిసి తాను నిర్మించే షార్ట్‌ఫిలింలోనూ నటించాలని కోరగా కొమురయ్య సానుకూలంగా స్పందించారని లక్ష్మణ్ తెలిపారు. నటీనటులు కనకారెడ్డి, సుమలత, లక్ష్మి, రాధిక తదితరులున్నారు.

సర్కార్ బడిలోనే చేరుదాం

పెద్దపల్లిరూరల్: మండలం అప్పన్నపేటలో సోమవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యాబోధన అందిస్తున్నామని కరపత్రాలు పంపిణీచేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేరి డబ్బులు ఖర్చు చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్య, దుస్తులు, పుస్తకాలను ఉచితంగా పొందాలని మధ్యాహ్నభోజనం కల్పిస్తున్నామని హెచ్‌ఎం హన్మంతు పేర్కొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిగేట్ జెడ్పీ పాఠశాలలో హాజరైన విద్యార్థులకు హెచ్‌ఎం ఏకాంబరం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. 85 మందికి 12 మంది హాజరయ్యారన్నారు.

‘రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన సర్కార్’



ఇంటింటా ప్రచారం చేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: తెలంగాణ వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చిందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో ఇంటింటా తిరిగి కాంగ్రెస్ పథకాలు, హామీలను వివరించారు. తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయి అనుకుంటే నిరాశే మిగిలిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే అసమర్థతతో గ్రామాల్లో అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకురేషన్‌కార్డులు, పింఛన్లు తదితర పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. నాయకులు చిలుక సతీష్, ప్రకాశ్‌రావు, బుచ్చిరెడ్డి, తిరుపతి, రాజిరెడ్డి, శ్రీనివాస్, వెంకటస్వామి ఉన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతంచేయాలి

ఎలిగేడు: కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని విజయరమణారావు అన్నారు. సోమవారం ఎలిగేడు కాంగ్రెస్ గ్రామశాఖ, యూత్ కమిటీ, మహిళా కమిటీ, వార్డు కమిటీలను నియమించారు. గ్రామ అధ్యక్షుడిగా సింగిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా కవ్వంపల్లి స్వామి, ముంజంపెల్లి మల్లేశం, ప్రధానకార్యదర్శిగా బండ రమేశ్, ప్రచారకార్యదర్శిగా భోగే సతీశ్, కార్యదర్శిగా బుర్ర గణేశ్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా కోట శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా బుర్ర అజయ్, శివ, ప్రధానకార్యదర్శిగా ఎండీ.షకిల్, ప్రచారకార్యదర్శిగా కోడూరి సాయి, కార్యదర్శిగా ముంజంపల్లి మల్లేశ్, మహిళా గ్రామకమిటీ అధ్యక్షురాలిగా వెంగళదాసు మమత, ఉపాధ్యక్షురాలిగా ముంజంపల్లి మంగ, ప్రధానకార్యదర్శిగా ముంజంపల్లి కనుకమ్మ, సభ్యులను నియమించినట్లు విజయరమణారావు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, అమ్ముల శ్రీనివాస్, కేశెట్టి విద్యాసాగర్, అమ్ముల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘నాణ్యత లేకుండా బీటీ రోడ్డు నిర్మాణం’



ఫిర్యాదు చేస్తున్న మహంకాళి స్వామి

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలో నాణ్యత లేకుండా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం పనుల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, పారదర్శకంగా విచారణ జరిపించాలని కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి డిమాండ్ చేశారు. సోమవారం కమిషనర్ సుమన్‌రావుకు ఫిర్యాదుచేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గోదావరిఖని పోలీస్‌స్టేషన్ కూడలి వరకు నిర్మించిన బీటీ రోడ్డు నాణ్యత పూర్తిగా లోపించిందని ఆరోపించారు. దీనికితోడు రోడ్డు కింద ఉన్న తాగునీటి పైపులైన్లు తరుచూ లీకవుతున్నాయని, పోలీస్‌స్టేషన్ ముందు మ్యాన్ హోల్స్ చాంబర్స్‌రోడ్డుపైకి ఎత్తుగా ఉన్నాయని, వాటిని సరి చేయకుండానే రోడ్డు నిర్మాణం చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు నాణ్యత ప్రమాణాలపై ఇతర విభాగాల ఇంజినీరింగ్ అధికారులతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

రామగుండం: ఉమ్మడి రామగుండం మండల విద్యావనరుల కేంద్రానికి దశలవారీగా వివిధ తరగతులకు చెందిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఈ సందర్భంగా రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ విద్యార్థులకు తొలివిడతగా 5,055 పుస్తకాలు ఎమ్మార్సీకి చేరగా మరో 920 పుస్తకాలు రావాల్సి ఉందని ఎంఈవో సంపత్‌రావు తెలిపారు. ఇప్పటికే రెండు కేజీబీవీలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తమ పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవాణి జూనియర్ కళాశాలలో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఫస్టియర్ పరీక్షల్లో 140 మంది విద్యార్థులకు 9మంది గైర్హాజ రయ్యారని, మధ్యాహ్నం సెకండియర్ పరీక్షలకు విద్యార్థులు 82 మందికి గాను 8మంది గైర్హాజరైనట్లు సీఎస్ శ్రీధర్ రావు తెలిపారు. మరో ఐదు రోజులు పరీక్షలు జరగనున్నాయి.

జూలపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు పెద్దపూర్ ఆదర్శపాఠశాల, కళాశాల విద్యార్థులు, తేలుకుంటలోని కస్తూరిబా బాలికల విద్యాలయం విద్యార్థులు ప్రథమ 72 మంది, రెండోసంవత్సరం 30 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.

27మంది గైర్హాజరు

పెద్దపల్లిరూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 507 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 480మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారిణి కల్పన తెలిపారు. 27మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు.

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలో పాల్గొన్న కార్మిక నేత జనక్ ప్రసాద్

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామం నడిబొడ్డున ఏర్పాటుచేసిన హోమశాలలో అర్చకులు ఉత్సవవిగ్రహాలకు హోమం కాల్చి విగ్రహ ప్రతిష్ఠాపనకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. గ్రామంలోని ఊర పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపనకు ఆలయంలో అర్చకులు పూ జలు చేశారు. అర్చకులు చెరుకుపల్లి శ్రీనివాస శర్మ, ముస్త్యాల దీక్షిత్ శర్మ, దేవరాజు, రంజిత్ శర్మ ఎంపీటీసీ దండె వెంకటేశం, మాలమహానాడు అధ్యక్షుడు కనకరాజు, మాజీ సర్పంచ్ బొడిగె లక్ష్మీనారాయణ, ఉత్సవకమిటీ నాయకులు పాల్గొన్నారు.

ప్రముఖుల హాజరు

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని బ్రాహ్మణపల్లిలో సోమవారం గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలకు డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తమ అనుచరులతో హాజరయ్యారు. అర్చకులు ఇరువురిని ఆశీర్వదించారు.

డ్యాన్స్ టీచర్‌కు సన్మానం



జ్యోతినగర్: 45 రోజులు ఉచిత నృత్యశిక్షణ అందించిన అబ్బోజు ఐశ్వర్యను తెలంగాణ మహిళా మిత్రస్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ సన్మానించారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో సేవాసంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో చిన్నారులకు ఉచిత డ్యాన్స్ తరగతులు నిర్వహించగా సోమవారం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పేద పిల్లలకు ఉచితంగా డాన్స్‌క్లాసులు నిర్వహించామని, ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ ఐశ్వర్య ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ఐశ్వర్యకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మేడి తిరుపతి, జూల అవినాష్, సరిత, లక్ష్మీ, శైలజ, సునీతలతో పాటు తదితరులు పాల్గొన్నారు.